# విద్యారంగ సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలి

**కొత్తగూడెం, నవంబర్30(కెరటం ప్రతినిధి)**

రాష్ట్రంలో ప్రభుత్వ విద్యార్థులకు అందించే ఆహారం కలుషితమైన కారణంగా వరుస ఫుడ్ పాయిజన్‌లు అయ్యి అనేకమంది విద్యార్థులు మరణానికి గురవుతున్నారు. రాష్ట్రంలోని నారాయణపేట, కొమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో విద్యార్థులు కలుషిత ఆహారం తిని శైలజ అనే విద్యార్థిని మృతి చెందడం జరిగింది. ఈ వరుస ఘటనలను నిరసిస్తూ ఈ ఘటనకు కారణమైన అధికారులను సస్పెండ్ చేసి తగు చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు అందించే ఆహార నాణ్యతను పెంచాలని అలాగే వారికి పరిశుభ్రమైన పౌష్టికాహారం అందించాలని ఐక్య వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్త ప్రభుత్వ పాఠశాలల బంద్ నిర్వహించడం జరిగింది. ఈ బంద్‌ను ఉద్దేశించి ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బుర్ర వీరభద్రం, పిడిఎస్యు జిల్లా కార్యదర్శి కంపాటి పృథ్వి, ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి మంద నాగకృష్ణ మాట్లాడుతూ ఈ రాష్ట్ర విద్యా వ్యవస్థను సమీక్షించే విద్యాశాఖ మంత్రి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం గడుస్తున్నప్పటికీ ఇప్పటికీ లేకపోవడం సిగ్గుమాలిన చర్య. ప్రభుత్వ



పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు మధ్యాన్న భోజన పథకం కింద ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు రూ 5.47 , హై స్కూల్ విద్యార్థులకు రూ 8.17 రాష్ట్ర వాట 40 శాతం, కేంద్ర వాట 60శాతంగా ప్రభుత్వాలు అందిస్తున్నాయి. ఈ చార్జీలు పెరిగిన ధరల కనుగుణంగా ఏ మాత్రం సరిపోవు. మనం బయట టీ కానీ , బిస్కట్ కానీ తినాలంటే 10 రూపాయల కంటే ఎక్కువ ఉంటున్నాయి. భావి భారత పౌరులుగా చెప్పుకునే విద్యార్థులకు ఒక టీకి అయ్యే ఖరీదు కూడా తమ మధ్యాహ్న భోజనానికి కేటాయించకపోవడం ఈ రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్నటువంటి సిగ్గుమాలిన చర్య అని చెప్పవచ్చు. ఇంత తక్కువ చార్జీలతో నాణ్యమైన భోజనం పెట్టడం ఎలా సాధ్యం. దీని ద్వారా విద్యార్థులకు అందించే ఆహారంలో కూడా కుళ్ళిన కూరగాయలు, కుళ్ళిన కోడిగుడ్లు , వంట చేసే ప్రాంతం అపరిశుభ్రంగా ఉండటం చేత ఆహారం కలుషితమై విద్యార్థులు ఫుడ్ పాయిజన్ కు గురై డయేరియా ఇతర ఆరోగ్య సమస్యలు వచ్చి హాస్పిటల్ పాలవుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే మధ్యాహ్న భోజన పథకానికి పెరిగిన ధరలకు అనుగుణంగా చార్జీలు పెంచాలి. విద్యార్థుల మృతికి కారణమైన అధికారులపై చర్యలు తీసుకోవాలి. వంట చేసే కార్మికులకు సకాలంలో జీతాలు ఇవ్వాలని ఐక్య వామపక్ష విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు చెరుకూరి రామ్ చరణ్ ,కొత్తగూడెం టౌన్ సెక్రటరీ సాగర్ , పాల్వంచ మండల కమిటీ సభ్యులు సాయి పాల్గొన్నారు.








## గండికోట కిరణ్ కుమార్ ఔదర్యం

◆ **పేదలకు దుప్పట్లు, స్వెటర్ల పంపిణీ**

**కొత్తగూడెం, నవంబర్30(కెరటం ప్రతినిధి)**

కొత్తగూడెం బస్టాండ్, రైల్వే స్టేషన్ ఉన్న అనాధలకు, పేదలకు కిరణ్ మెగా ఈవెంట్స్ ఆర్గనైజర్ గండికోట కిరణ్ ఆధ్వర్యంలో దుప్పట్లు, స్వెటర్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతు చలికాలం కావడంతో కొత్తగూడెం చుట్టుపక్కల ఉన్న యాచకులు, పేదలు చలికి వణకడం చూసి చలించిపోయానని, నా అన్నవాళ్లు లేక అలాంటి వాళ్లు పడే బాధలు వర్ణనాతీతమని, అందుకే తన వంతుగా 150 దుప్పట్లు, 50 స్వెటర్లు అందజేశానని పేర్కొన్నారు. వారందరికీ తమకు చేతనైన సాయం చేయడం సంతృప్తినిచ్చిందని అన్నారు. భవిష్యత్తులో మరిన్ని సేవాల కార్యక్రమాలు చేపడుతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో చదలవాడ సూరి, కెరటం శ్యామ్, తదితర పాత్రికేయ మిత్రులు పాల్గొన్నారు.




## చదువుతోనే సామాజిక ప్రగతి

**జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.భానుమతి**

**కొత్తగూడెం, నవంబర్30(కెరటం ప్రతినిధి)**

ప్రతి ఒక్కరు జీవితంలో ముందుకు సాగి విజయం సాధించాలంటే మెరుగైన విద్యా అవసరమని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.భానుమతి అన్నారు. శనివారం రుద్రంపూర్ గవర్నమెంట్ హై స్కూల్ లో జరిగిన న్యాయ అవగాహన కార్యక్రమంలో న్యాయమూర్తి ముఖ్య అతిథిగ పాల్గొని ప్రసంగించారు. విద్యా ఆత్మ విశ్వాసాన్ని పెంచుతుందని చదువుతోనే సామాజిక ప్రగతి సాధ్యపడుతుందని అన్నారు. అసమానతలను విడనాడి అన్ని వర్గాల వారికి విద్యా, ఉద్యోగ, తదితర రంగాలలో మెరుగైన అవకాశాలు కల్పించడం ద్వారా సామాజిక ప్రగతి సాధ్యపడుతుందని అన్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో అత్యున్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. పాఠశాల నుండి చెకుముకి మరియు ఇతర అంశాలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఈ సందర్భంగా న్యాయమూర్తి అభినందించారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్య నారాయణ, పాఠశాల హెడ్ మాస్టర్ బాలాజీ , టూ టౌన్ ఎస్ఐ షాహినా, అసిస్టెంట్ కౌన్సిల్స్ నాగ స్రవంతి, జ్యోతి విశ్వకర్మ న్యాయవాది మెండు రాజమల్లు ఉపాధ్యాయులు, కానిస్టేబుల్స్ విద్యార్థులు పాల్గొన్నారు.



## విద్యార్థులకు బ్యాగులు పంపిణీ

**కొత్తగూడెం, నవంబర్30(కెరటం ప్రతినిధి)**

లక్ష్మీదేవిపల్లి మండలం హమాలికాలని యంపిపియస్ పాఠశాలలో శ్రీనగర్ కాలని వాస్తవ్యులు అక్రమ్ హుస్సేన్ అండ్ సన్స్ వారి ఆర్థిక సాయంతో 1 తరగతి నుండి 5వ తరగతి విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేశారు. వాటిని శనివారం ఆత్మ కమిటీ డైరెక్టర్ శేషాద్రి వినోద్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బానోత్ భద్రమ్మ, ఉపాధ్యాయురాలు దొడ్డ రాజేశ్వరి, లక్ష్మీదేవిపల్లి మండల ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ తుంపిరి వరప్రసాద్, వీరపనేని రామకృష్ణ, తుర్పాటి కొమరయ్య, నరేష్, శివ, అనురాధ తదితరులు పాల్గొన్నారు.